నవ్య వీక్లి - పసుపులేటి లక్ష్మీనారాయణ స్మృతిసాహితి కథల పోటీలో

# రూ. 2,000 ప్రోత్సాహక బహుమతి పొందిన కథ

# గమనం

సత్యాభాస్కర్

''డాడీ! కాలేజీకి వెళుతున్నాను! బై!'' శివ పిలుపుతో తన ఆలోచనా లోకం నుండి బయటపడ్డాడు ప్రభాకర్.
''బై! నాన్నా! జాగ్రత్తగా వెళ్ళు! ఆల్ ద బెస్ట్! హావ్ ఎ గుడ్ డే!'' అంటూ నవ్వుతూ చేయూపాడు.
'ఓకే!' ''బై! మమ్మీ!'' అంటూ ఫ్లాట్ మెయిన్‌డోర్ దగ్గరకు వేసి టకటకా మెట్లు దిగుతూ వెళ్ళిపోయాడు. వెనకాలే శ్యామల ''ఆగు నాన్నా!'' అంటూ ఏదో చెప్పుకుంటూ పరుగెత్తింది. హాలులో వున్న ప్రభాకరంకు ఇద్దరి సంభాషణ వినబడుతుండ గానే వెళ్ళిపోయారు.

తన కళ్ళముందే ఒక నవతేజం వెళ్ళిపోయిన ట్లుగా ఏదో నిస్సత్తువ, నిస్పృహ శరీరాన్ని, మనస్సును ఆవరించినట్లుగా అనిపించింది.

ఇంటర్‌మీడియట్ మొదటిరోజు, తాను కాలేజీలో దింపుతానన్నా వినకుండా, తానొక్కడినే వెళతానని పట్టుపట్టాడు. కాలేజీకోసం కొత్తసైకిల్ కొనిపించుకున్నాడు. స్కూటీనో, లూనానో కొనిస్తానన్నాడు.

''ఎందుకు డాడీ! పెట్రోలు ఖర్చు. నేనేమయినా సంపాదిస్తున్నానా? సైకిల్ అయితే నాకు ఎక్సర్‌సైజు కూడా అవుతుంది'' అని నిరాకరించాడు. తనకు ఎంతో సంతోషం అనిపించింది.

ఆ వయసులో వాస్తవికంగా ఆలోచించడం వాడి మానసిక పరిణతి సూచిస్తుంది. తమ పెంపకంలో వాడికోసం పడ్డకష్టం ఇక ఫలించినట్లే అనిపించింది. సమాజంలో నేడున్న కాలుష్య వాతావరణంలో పిల్లలను కాపాడుకోవడం వాళ్ళను సరయిన దారిలో పెట్టడం ఎంత కష్టభరితమో ప్రభాకరంకు బాగా తెలుసు. ఏ మాత్రం దారితప్పినా వాళ్ళు తాగుబోతులుగానో, తిరుగుబోతులుగానో జులాయిలుగానో కావడానికి నిమిషం పట్టదు. శివ తన దగ్గరకొచ్చినప్పటి నుంచి కూడా...

...ఒకసారి ఆలోచన అక్కడ ఆగిపోయింది. శివ తమ కన్నకొడుకు కాదు. ఒక్కసారిగా మెలిపెట్టి నట్లు గుండెలో బాధ... మసక మసకగా శివతల్లిదండ్రుల రూపం మనోఫలకం మీద... చిన్నా, సారికలు తమ ఆరేళ్ళ పిల్లాడితో ఇంటికి వచ్చిన రోజు... ఇంకా నిన్నామొన్న అన్నట్లే వుంది! కాలం ఎంత వేగంగా సాగిపోతుంది. అప్పుడే పదమూడేళ్లు దాటిపోయింది. ఆరోజు కళ్ళవెంట నీళ్ళురాబోయి ఆగిపోయాయి. బహుశా బాధపడటానికి, ఏడ్వటానికి అర్హతలేదేమో!?

తాను ఒకనాడు రాసిన కవితలోని పంక్తులు గుర్తొచ్చాయి.

కడివెడు కన్నీళ్ళు
గుండెల్లో ఇంకి
మహానదులయి ప్రవహిస్తున్నాయి.
కంటతడి కనబడటం ఏనాడో మానేసింది.
కనబడకుండా
ఏడ్వడం నేర్పిందీ నాగరికత!

అందుకేనేమో గుండెలు పిండేస్తున్నా కళ్ళలో నీటిపొర కూడా కనబడకుండా అంతా మామూలే అన్నట్లు...

ఆ రోజు... పదిహేనేళ్ళ క్రితం.

ఉదయం 10 గం.లు అవుతోంది. తలుపు చప్పుడవడంతోబాటు, కాలింగ్ బెల్ కూడా మోగింది. బెడ్‌రూంలో తన టేబుల్ వద్ద కూర్చొని ఏదో రాసుకుంటున్నాడు తను. వెంటనే ఎలర్టయినప్పటికీ, తలుపులు తీయడం ఎవరొచ్చారో చూడటం శ్యామల పనికాబట్టి, కలం ఒక్కసారి ఆపి, పిలుపుకోసం చూశాడు. ఈ సమయంలో వచ్చేది వాచ్‌మెన్ లేదా ఇస్త్రీవాడో అయ్యుంటాడు అని అనుకున్నాడు. తన కోసం ఎవరూ ఎక్కువగా రారు. తన కొలీగ్స్ ముందుగా అపాయింట్‌మెంట్ తీసుకోనిదే రానే రారు. ఎంతో ముఖ్యమైన వాళ్ళు మాత్రమే హఠాత్తుగా ఊడిపడతారు. ఎవరయినా సరే ముందు శ్యామల మాట్లాడాకే తనకు పిలుపు వస్తుంది.

హాలులో వచ్చిన వాళ్ళతో శ్యామల మాట్లాడటం వినిపిస్తోంది. ఇంతలోనే తన తలుపు చప్పుడు చేసింది శ్యామల! ఎవరో తనకోసమే వచ్చారు!? సరే! ఇక తప్పదనుకుంటూ వెళ్ళి తలుపు తీయగానే బెడ్‌రూం నుండి హాల్‌లోకే సరాసరి దారి వుండటంతో ఎదురుగా వచ్చిన వాళ్ళు కనపడ్డారు. ఇద్దరు యువదంపతులు, ఒక పిల్లవాడు హాల్‌లోని సోఫాసెట్‌లో కూర్చొని వున్నారు.

''మీ ఫ్రెండంటండి!'' అని శ్యామల వంటింట్లోకి వెళ్ళిపోయింది.

''నమస్కారం సార్! గుర్తు పట్టారా!'' అంటూ ఆ యువకుడు, యువతి లేచి నిలబడ్డారు.

ఆ యువకుడి కళ్ళలో తనపట్ల ఎంతో అభిమానం, వాత్సల్యం, ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న ఆప్తుడిని కలిసిన ఆనందం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. ఆ అమ్మాయి కూడా అంతే ఆరాధన భావంతో, గౌరవంతో చూస్తోంది. పిల్లవాడు లేచి రెండు చేతులు జోడిస్తూ నిలబడ్డాడు.

జ్ఞాపకాల పొరల్లో విస్ఫోటం! తన యవ్వనం తిరిగొచ్చినంత ఉత్తేజం! నిస్తేజంగా సాగుతున్న తన జీవన ప్రయాణానికి ఒక వెల్లువ!

''అరె! ఎందుకు గుర్తుపట్టలేదు. చిన్నా! హౌ ఆర్ యు! వాట్ ఎ సర్ప్రయిజ్'' అంటూ ఉబ్బితబ్బిబ్బవుతూ ఆ యువకుడిని కౌగిలించుకున్నాడు.

ఇద్దరి కళ్ళలోను కన్నీటి పొర! ఎన్నాళ్ళుగానో తన మనస్సు మోస్తున్న వ్యథ, లోలోపల తినేస్తున్న పశ్చాత్తాపం దూది పింజలా తేలిపోయినట్లయింది.

ఈ హడావుడికి వంటగది గుమ్మంలో నిలబడ్డ శ్యామల ఎవరో బాగా దగ్గర వాళ్ళని గుర్తించి సంభ్రమాశ్చర్యాలతో చూస్తోంది.

''శ్యామలా! ఈ యంగ్‌మాన్ పేరు చిన్నా! నీకు చెప్పేవాడినిగా నా ప్రియశిష్యుడు!'' అంటూ పరిచయం చేశాడు.

''నమస్కారం అమ్మా! ఈమె సారిక నా సహచరి! వీడు మా పిల్లాడు శివ'' అంటూ కుటుంబాన్ని పరిచయం చేశాడు.

''కూచోండి! చిన్నా! శ్యామలా! ఇవాళ ఆఫీసుకు వెళ్ళడం లేదు. వీళ్ళు మన ఇంట్లోనే వుంటారు. సారికను నీతోడుగా తీసుకో'' అంటూ హడావుడిగా ఆర్డర్లు వేసేసాడు ప్రభాకరం.

తమను అంతబాగా రిసీవ్ చేసుకున్నందుకు

వాళ్ళలో అప్పటివరకూ ఉన్న బెరుకు ఒక్కసారిగా తొలగిపోయింది.

మానవత్వపు స్పర్శతో ఏ డబ్బు దస్కం, భోగాలు సరితూగలేవు. ఆప్యాయత ఆదరణ, సంఘ జీవనం మనిషి సహజ లక్షణాలు.

''పద చిన్నా! మన రూంలో వెళ్ళి మాట్లాడుకుందాం!'' అంటూ బెడ్‌రూంలోకి దారితీసాడు ప్రభాకరం.

తనకూ చిన్నాకు వున్న అనుబంధం మనస్సులో ఒక్కసారిగా కళ్ళముందు కదలాడింది. తాను విద్యార్థి వుద్యమ నిర్మాణ బాధ్యుడుగా కృషి చేస్తున్న రోజుల్లో చిన్నా పరిచయమయ్యాడు. గ్రామీణ వాతావరణం నుండి నగరానికి చదువుకోవడానికి వచ్చి కాచిగూడ పరిసర ప్రాంతాలలో రూంలో తోటి ఊరి వాళ్ళతో కలిసి వుండేవాడు. ఆ రోజుల్లో సామాజిక సమస్యల మీద స్పందించడంలో విద్యార్థి లోకం అగ్రభాగాన వుండేది.

చిన్నాలోని చురుకుదనం, ధైర్యం బాగా ఆకర్షించాయి. క్రమంగా పరిచయం పెంచుకొని ఉద్యమంలోకి తీసుకువచ్చాడు. చిన్నాతోపాటు వాళ్ళ ఊరి వాళ్ళయిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉద్యమంలోకి వచ్చారు. చూస్తుండగానే నగర విద్యార్థి వుద్యమానికి వెన్నుదన్నయ్యాడు. ఈ క్రమంలో ప్రభాకరం సమాజంలోని వర్గాలు, వర్గదోపిడి, విప్లవ కర్తవ్యాలు తెలియజేసి సాహిత్యాన్ని విద్యార్థులకు బోధిస్తూ వాళ్ళకు మార్గదర్శకుడయ్యాడు. ప్రభుత్వ నిర్బంధం, శత్రువుల దాడులు, ప్రతిదాడులు, లాకప్పులు, లాఠీ ఛార్జీలు, జైలు జీవితాలు విద్యార్థి నాయకులను రాటుదేల్చాయి. ప్రభాకరం గ్రామీణ ప్రాంతాలకు బాధ్యుడిగా అజ్ఞాతంలోకి వెళ్ళడంతో, పూర్తిస్థాయి విప్లవ కార్యకర్తగా మారిన చిన్నాకు విద్యార్థి రంగం బాధ్యతలు అప్పజెప్పబడ్డాయి.

ఏళ్ళు గడిచాయి. అప్పుడప్పుడు పార్టీ సమావేశాలలో తప్ప చిన్నాతో కలవడం తగ్గింది. కలిసినప్పుడల్లా ఇద్దరి మధ్య మాటలలో చెప్పలేని అనిర్వచనీయమైన ఆత్మీయతానుభూతి పెల్లుబికేది. నెలలు కనబడకపోయినా ఇద్దరూ నిత్యం కలిసి వున్నట్లుగానే అనిపించేది. అలాంటిది సంవత్సరాలు గడిచాక ఈ రోజు... ఉద్యమం నుండి వైదొలగి సాధారణ జీవితం గడుపుతున్న ప్రభాకరం వద్దకు విప్లవోద్యమంలో కీలక స్థాయిలో కొనసాగుతున్న చిన్నా దంపతులు రావడంలో ఆంతర్యం... ప్రభాకరం మదిలో మెదులుతున్న ప్రశ్నలు...

ఇద్దరి మధ్య కాలప్రవాహం లాగే గత స్మృతులు... వాటిని దాటి ఇద్దరి మధ్యా లింక్ తెగిపోయిన దగ్గరి నుండి నేటిదాకా జరిగిన సంఘటనలను నెమరు వేసుకున్నారు. ఈ భాగం మాత్రం చిన్నానే ఎక్కువగా చెప్పాల్సి వచ్చింది. ప్రభాకరం దగ్గర ఏముంది? ఒక ప్రైవేట్ సంస్థలో ఉన్నతోద్యోగిగా స్థిరపడ్డాడు. బయటకు వచ్చాక బంధువు అయిన శ్యామలతో వివాహం. మామూలు జీవనం. మాటల్లో పడి వుండగానే రెండు టీలు, టిఫిన్‌లు అయ్యాయి. మధ్యాహ్నం రెండు అవడంతో శ్యామల భోజనానికి పిలిచింది.

''గురు శిష్యులు ఇంకా ఎంతసేపని మాట్లాడుకుంటారు. ఆకలి వేయడం లేదా! వంట చేసాం. రండి భోం చేద్దురుగాని'' అని పిలిచింది.

ఆత్మీయబంధువులు రాకతో ఆమె మొహంలో సంతోషం కొట్టొచ్చినట్లుగా కనబడటంతో, ఎండి మోడువారిన వాళ్ళ కుటుంబంలోకి చిన్నారాక నవ వసంతంలాగా ఉత్తేజాన్నిచ్చింది.

''పద చిన్నా! భోజనం కానిద్దాం. మళ్ళీ కూచుని మాట్లాడుకుందాం. చేతులు కడుక్కో నీవు'' అని కిచెన్‌లోకి దారితీసాడు.

అంతవరకూ హాల్లో టీవీ చూస్తున్న ఆరేళ్ళ పిల్లవాడు శివ ఒక్కసారిగా టివి ఆపేసి బెరుగ్గా చూస్తూ కూర్చున్నాడు.



పిల్లవాడిని చూడగానే వాత్సల్యం పొంగుకు వచ్చింది ప్రభాకరానికి.

''ఏమోయ్! హీరో ఏమన్నా తిన్నావా? లేదా టీవీనే చూస్తున్నావా?'' అంటు పలకరించాడు.

''ఆ! పిల్లవాడికి తిండిపెట్టకుండా వుంటామండీ? మీకంటే స్నేహితుడి మాటలతో కడుపు నిండినట్లుంది. పసివాడు, అన్నీ తినిపించాం లేండి'' అని శ్యామల జవాబిచ్చింది.

'అందరం కలిసి భోంచేద్దాం' అని ప్రభాకరం అనడంతో

చిన్నా, సారిక ప్రభాకరం, శ్యామల క్రిందనే కంచాలు పెట్టుకుని కూర్చున్నారు.

మాటలాపి చిన్నాభార్యను పరిశీలనగా చూశాడు ప్రభాకరం. గ్రామీణ యువతి అయినప్పటికీ ఉద్యమం నేర్పిన పాఠాలతో నవజీవన

స్ఫూర్తితో పరిణతి చెందినట్లుగా కనబడుతోంది. ఆమె మాటలు, కదలిక శిక్షణ పొందిన సైనికురాలిని తలపిస్తున్నాయి. తమను ఆదరించే వారింట్లో గడుపుతున్న అమూల్య క్షణాలు ఆమెలో ఆనందాన్ని కలిగిస్తున్నా ఏదో విషాదఛాయలు మొఖంలో గోచరిస్తున్నాయి.

భోజనాలయ్యాక మళ్ళీ చిన్నా, ప్రభాకరం బెడ్‌రూంలో కుర్చీల్లో కూర్చున్నారు. గతాన్ని అంతా తిరగవేసాక వర్తమానం వాళ్ళమధ్య కఠోర వాస్తవం లాగ నిలబడి వుంది. ''చాలా రోజుల తర్వాత వచ్చారు. ఒక వారం రోజులుండండి'' అని అన్నాడు ప్రభాకరం.

''లేదు సార్! మళ్ళీ ఎప్పుడయినా వీలయినప్పుడు వస్తాం! సాయంత్రం 5 గం.లకు మేము వెళ్ళిపోవాలి. ఒక ముఖ్యమైన విషయమై మీ వద్దకు వచ్చాం. మీ అడ్రస్ తెలుసుకోవడానికి నేను గత ఆరు నెలలుగా ప్రయత్నిస్తున్నాను. మన పాత పరిచయాలన్నింటినీ వెదుక్కుంటూ వచ్చి మీ వద్దకు ఈ రోజుకు చేరగలిగాను'' అని కొద్దిసేపు మౌనంగా ఉన్నాడు.

చిన్నా వచ్చిన పనిని చెప్పబోతున్నాడని ప్రభాకరం ఊహించాడు. ఇన్నేళ్ళుగా కనబడని చిన్నా, తనను చూడడం కోసం రాలేదని ప్రభాకరం గ్రహించాడు. ఏదో ప్రత్యేకమయిన పని కోసం వచ్చాడు. ఏమిటాపని? ప్రభాకరంలో ఉద్విగ్నత చోటు చేసుకుంది.

''నేడు విప్లవోద్యమం కీలక దశకు చేరుకుంది. రోజురోజుకు ప్రభుత్వ నిర్బంధం పెరుగుతోంది. అజ్ఞాతంలో వున్నప్పటికీ ఇంతవరకూ నేను నా కుటుంబం ఒకే దగ్గర కలిసి వుంటున్నాం. ఇక ముందు అలా వుండే పరిస్థితి లేదు. ఉద్యమావసరాల కోసం మమ్ములను పార్టీ వేరే రాష్ట్రాలకు పంపిస్తోంది. బహుశ నేను, సారిక కూడా ఒకే దగ్గర ఉండక పోవచ్చును. ఈ స్థితిలో పిల్లవాడు 'శివ'ను మాతోపాటూ వుంచుకోవడం సాధ్యం కాదు. కాబట్టి ఎవరయినా శ్రేయోభిలాషులు, బంధువుల దగ్గర పిల్లవాడిని వదిలి వెళ్ళాలని నిర్ణయమయింది. ఈ ఉద్యమానికి పూర్తికాలం కార్యకర్తగా రాగానే మా కుటుంబంతో కాని, మా బంధువులతో కాని నాకున్న సంబంధాలన్ని తెగిపోయాయి. ఈ రోజు ఈ పనిమీద వాళ్ళవద్దకు వెళ్ళినా మమ్మల్ని ఏ మాత్రం ఆదరించరు'' కొద్ది క్షణాలు ఆగాడు ''మీరేమీ అనుకోకపోతే నేను ఒక ప్రతిపాదన పెడతాను. మీరు మనస్ఫూర్తిగా ఆమోదిస్తేనే అంగీకారం తెలపండి. లేకపోతే నేనేమీ బాధపడను. మీ పట్ల గౌరవం, అభిమానం, జీవితాంతం వుంటాయి... నా కొడుకు 'శివ'ను మీ కొడుకుగా పెంచుకో గలుగుతారా సార్!... మీ దంపతులు చర్చించుకొని తెలపండి. శివను మీ దగ్గర వదిలి వెళతాం. మళ్ళీ వారం రోజుల్లో మిమ్ములను కాంటాక్ట్ చేస్తాను. మీకు ఆమోదం లేకపోతే నేను గాని, వేరే వాళ్ళు గాని వచ్చి శివను తీసుకువెళ్తారు. అంగీకరిస్తే శివ మీ కొడుకుగానే ఎదుగుతాడు. మీ పెంపకంలో శివ తప్పకుండా ప్రయోజకుడవుతాడని మా ఇద్దరికి నమ్మకముంది'' అంటూ చివరి వాక్యాలు వణికే గొంతుతో పలికాడు చిన్నా!


ఒక్కసారిగా గదిలో గాలి స్తంభించినట్లయింది.

ప్రభాకరం ఏమీ మాట్లాడకుండా చిన్నా మొఖాన్ని చూస్తూ కూర్చుండిపోయాడు.

ఊహించని ప్రతిపాదన. ఆర్థిక సహాయం చేయమని అడుగుతాడేమో, ఎంతవరకు ఇవ్వగలమని లెక్కలు వేసుకుంటున్న ప్రభాకరానికి నోటి మాట రాలేదు. ఏమంటున్నాడు. తన కొడుకును పెంపకానికిస్తానంటున్నాడా? పిల్లలు లేని తమ కుటుంబంలోనికి 'శివ'ను దత్తతునిస్తున్నాడా!

కొద్ది క్షణాల్లో తేరుకున్న ప్రభాకరం...

''మీరు బాగా అలసిపోయి వుంటారు. వేరే బెడ్‌రూంలో రెస్ట్ తీసుకోండి. సాయంత్రం వెళ్ళే ముందు లేపుతాం. ఈ లోపల నేను మా ఆవిడతో చర్చించి నీకు మా నిర్ణయం తెలుపుతాం'' అంటూనే శ్యామలను కేకేసాడు.




''వాళ్ళిద్దరికీ బెడ్‌రూం చూపించమ్మా! బాగా అలసిపోయినట్లున్నారు. సాయంత్రం వెళ్ళిపోతారట. కాసేపు విశ్రాంతి తీసుకుంటారు'' అని అన్నాడు ప్రభాకరం.

''అదేంటండి! చాలాకాలం తర్వాత కలిసిన బాల్యమిత్రులను ఈ రోజే పంపించి వేస్తారా! ఈ రెండు రోజులుండమనకపోయారా! మీ కబుర్లన్ని అప్పుడే అయిపోయాయా'' అని అంటూనే చిన్నాను, సారికను వేరే బెడ్‌రూంలోకి తీసుకు వెళ్ళింది.

ఆ రోజు ఇప్పటికీ కళ్ళముందు కదలాడుతూనే వుంది. శ్యామల ప్రభాకరంలు తమ బెడ్‌రూంలో తలుపులు వేసుకుని చిన్నాప్రతిపాదనను కూలంకషంగా చర్చించారు. ఊహించని ప్రతిపాదనతో మాటరాక షాక్ అయింది శ్యామల. చిన్నా నేపథ్యం తెలియని ఆమె ఒక్కసారిగా దిగ్ర్భాంతికి గురయ్యింది. ప్రభాకరం గత జీవితం గురించి తెలిసినా శ్యామలకు అంతగా అవగాహన లేదనే చెప్పాలి. అప్పుడప్పుడు సంభాషణల్లో తప్ప ప్రభాకరం ఎన్నడూ ఉద్యమ జీవితం గురించి వివరంగా శ్యామలతో మాట్లాడక పోవడమే దానికి కారణం. ఎప్పుడయినా అడిగినా అవంత ఘన కార్యాలు కావులే అని నవ్వుతూ కొట్టేసేవాడు ప్రభాకరం. కాని ఈ రోజు తప్పకుండా వివరించాల్సి వచ్చింది. పెళ్ళయి ఏడెనిమిది సంవత్సరాలు గడిచినా పిల్లలు లేకపోవడంతో ఎవరయినా పిల్లవాడిని పెంచుకోవాలనే ఆలోచన వాళ్ళిద్దరి మధ్య ఈ మధ్యనే నలుగుతోంది. అనుకోకుండా వచ్చిన ఈ ప్రతిపాదన వాళ్ళను ఒక్కసారిగా కుదిపివేసింది. సాయంత్రం నాలుగున్నర ప్రాంతంలో చిన్నా, సారిక, శివలు గదినుండి బయటకు వచ్చారు. అప్పటికే మాట్లాడుకోవడం ముగియడంతో ప్రభాకరం, శ్యామలలు హాల్‌లో కూర్చుని 'టీ' త్రాగుతూ టీవి చూస్తున్నారు.

''లేచేసారా! కొద్దిసేపు పడుకోపోయారా! మొఖాలు కడుక్కొని రండి 'టీ' పెట్టిస్తాను'' అంటూ శ్యామల హడావుడి పడింది.

''రావోయ్ శివ! నా దగ్గర కూర్చో'' అని ప్రభాకరం పిల్లవాడిని దగ్గరకు తీసుకుని ప్రక్కన కూర్చో పెట్టుకున్నాడు.

చిన్నావాళ్లు మొఖాలు కడుక్కుని రాగానే శ్యామల టిఫిన్, టీలతో హాల్‌లోకి వచ్చింది.

అప్పటికే సారిక ఇద్దరి బ్యాగులు సర్దేసి బయలు దేరడానికి సిద్ధంగా వుంది.

అందరూ హాల్లో సోఫాల్లో కూర్చున్నారు.

టీ తాగుతూ చిన్నా దంపతులు ముభావంగా సమాధానం కోసం అన్నట్లుగా మౌనంగా వున్నారు.

ఇంతలో శ్యామల కూడా ప్రభాకరం, శివల ప్రక్కన సోఫాలో వచ్చి కూర్చుని పిల్లవాడిని దగ్గర తీసుకుంది.

చిన్నా, సారికల మొఖంలో ఆనందం విప్పారింది. వాళ్ళు ఎన్నో నెలలుగా పడుతున్న మానసిక వేదన తొలగిపోయినట్లయింది.

''మేము వారంలో మళ్ళీ వస్తాం సార్! మీకు ఫోన్ చేస్తాను. శివకు అంతా వివరించాం. మీ తోటి వుంటాడు'' అని అంటూ శ్యామలతో ''వస్తా మక్కా! ఇహనుండి శివ మీ బిడ్డ'' అంటున్న చిన్నా గొంతు దుఃఖంతో పూడుకుపోయింది.

సారిక కళ్ళలో నీరు ధారాపాతంగా వర్షిస్తున్నాయి. ఒక్కసారి భోరుమంది కన్నతల్లి. శివ ఒక్కసారిగా తల్లిదండ్రుల వొడిలో వొదిగిపోయాడు. ప్రభాకరం శ్యామలకు ఆ కుటుంబాన్ని చూసి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఏమీ మాట్లాడకుండా చూస్తూ వుండిపోయారు.

''నీవేమి బాధపడకు చిన్నా! మేమే ఎవరినయినా పిల్లవాడిని దత్తత చేసుకుందామనుకుంటున్నాం. నీ కొడుకును పెంచడంలోనయినా నేను ఉద్యమానికి తోడ్పడితే అంతకన్నా నాకు సంతృప్తి ఏముంటుంది. శ్యామల కూడా ఎంతో సంతోషంగా వొప్పుకుంది. ఈ రోజు నుండి 'శివ' మా కొడుకు. మా శక్తిమేరకు వాడిని చదివించి ప్రయోజకుడ్ని చేస్తాను. ఏనాడు నీవు తిరిగి వచ్చినా నీకు అప్పగిస్తాను'' అని ప్రభాకరం, శ్యామల ఒకేసారి అనునయించారు.

''మేము తిరిగి రావడం జరగదు సార్! మేం ప్రయాణిస్తున్న రహదారి అలాంటిది. ఒక వేళ జరిగినా శివ మీ కొడుకే అవుతాడు తప్ప మా వాడు కాదు. మేం వెళ్ళాల్సిన సమయం అయింది. మేం వస్తాం'' అంటూ కొడుకును దగ్గర తీసుకొని ''శివా! మేము చెప్పినట్లే నడుచుకో నాన్నా! నీవు అమ్మ, నాన్నల మాట వింటావుగా'' అంటూ వదలలేక వదులుతూ లేచి నిలబడ్డారు.

శివకూడా మాట్లాడకుండా వెక్కిళ్ళు పెడుతున్నాడు.

చిన్న, సారికలిద్దరు ఒక్కసారిగా ప్రభాకరం, శ్యామలకు పాదాభివందనం చేసారు. కన్నీళ్ళతోనే ఆశీర్వదిస్తూ చిన్నను తన కౌగిలిలోకి తీసుకున్న ప్రభాకరం ధైర్యంగా వుండమన్నట్లు వెన్ను తట్టాడు.

శ్యామల కూడా సారికను పొదువుకుని ''నా చెల్లెలు వంటిదానివి, కొడుకు గురించి బెంగ పడకు. మీ గురించి ఆయన అన్నీ చెప్పారు. నేను పల్లెటూరిదాన్ని. నాకు మీరు చేసేవి తెలియకపోయినా సమాజం కోసం మంచి పని చేస్తున్నారనే అనుకుంటున్నాను. శివను కన్న కొడుకు కన్నా బాగా చూసుకుంటాను. మధ్యమధ్యలో ఉత్తరాలు రాస్తూండండి. ఫోను చేయడం చేస్తుండండి''.

''ఒక్క నిమిషం ఆగండి!'' అంటూ బెడ్ రూంలోకి వెళ్ళి ఒక చీర, జాకెట్టులతో వచ్చింది శ్యామల. ''తీసుకో సారిక వట్టి చేతులతో నిన్ను పంపకూడదు'' అంటు మొఖాన బొట్టుపెట్టి, బట్టలు చేతుల్లో పెట్టింది.

''ఇప్పుడు ఇవెందుకక్కా!'' అంటూనే ఆ బట్టలను బ్యాగ్‌లో పెట్టి సర్దుకుంది.

ప్రభాకరం కూడా చిన్నాకు రెండు వేల రూపాయలిచ్చి వుంచమని చెప్పాడు.

''శివా! అమ్మా, నాన్నలకు కాళ్ళకు నమస్కారం పెట్టు'' అని పిల్లవాడితో పాదాభివందనం చేయించింది సారిక.

ఆ రాత్రితో పాటే చిన్న, సారికలు చీకట్లో కలిసిపోయారు.

శివ వాళ్ళు వెళ్తున్న వైపే చూస్తూ చేయి వూపుతూ నిలబడి పోయాడు.

ఆ రాత్రి నుండి ప్రభాకరం దంపతులకు కంటి పాప అయ్యాడు.

వారం కాదుకదా, ఏళ్ళు గడిచినా చిన్నా దంపతుల నుండి ఎటువంటి సమాచారం లేదు. అదే వాళ్ళ ఆఖరి కలయిక.

***

చూస్తుండగానే రెండేళ్ళు గడిచిపోయాయి. శివ నూనూగు మీసాల యువకుడయ్యాడు. ఇంజనీరింగ్‌లో చేరాడు.

''డాడీ! నేను ఈ హాలిడేస్‌లో మా క్లాస్‌మేట్లతో కలిసి వారం రోజులు శ్రీశైలం వెళ్తున్నాం!'' అని అన్నాడు శివ.

ఏదో రాసుకుంటున్న ప్రభాకరం ఒక్కసారి తలెత్తి చూసాడు.

''శ్రీశైలంలో ఏమి పని? దేముడిని చూడడానికి వారం రోజులా?'' అని ఆశ్చర్యంగా ప్రశ్నించాడు.

వంటింట్లో పని చేసుకుంటున్న శ్యామల కూడా ఈ మాటలు విని బెడ్‌రూంలోకి వచ్చింది. ఇంట్లో వున్నంతసేపు కొడుకు వెనకాల వుంటుంది. ప్రభాకరం ఏమన్నా మాట అంటాడేమోనని శివను కాచుకోవడానికి సిద్ధంగా వుంటుంది.

''ఆ దేవాలయం చూడడానికి ఒక్క రోజే పడుతుంది డాడీ! మిగతా రోజుల్లో మేము అడవుల్లో దాదాపు 20 కిలో మీటర్లు నడిచి వెళ్ళి ఒక పాత దేవాలయం వుంది. దాన్ని చూసి వస్తాం. అక్కడ ప్రతి సంవత్సరం గిరిజనులు ఈ నెలలోనే జాతర చేస్తారుట. మా క్లాస్‌మేట్‌లం పదిమంది కలిసి వెళ



# కాజల్ డిమాండ్ తగ్గిందా?

'మగధీర'తో ఒక్కసారిగా ఆకాశమంత ఎత్తుకు ఎదిగిన కాజల్ ప్రస్తుతం కింద పడేటట్టు ఉంది. కిందపడడం అంటే నేల మీద పడడం కాదు. ఆమె డిమాండ్ తగ్గుతోందనే పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఆమె తాజా చిత్రం 'గణేష్' బాక్సాఫీస్ వద్ద పల్టీ కొట్టడంతో, కాజల్ ఈ పరిస్థితికి చేరుకున్నట్లు పరిశ్రమ వర్గాలు అంటున్నాయి. ఈ సినిమా విడుదలకు ముందు ఆమె కోటి రూపాయలు డిమాండ్ చేసినా, ఆనందంగా అంగీకరించి అడ్వాన్స్‌లు చెల్లించిన కొందరు నిర్మాతలు తమ డబ్బులు వాపస్ తీసుకునే ఉద్దేశంలో ఉన్నారని భోగట్టా! ఒక తమిళ నిర్మాత ఇంకొక అడుగు ముందుకు వేసి తను ఇచ్చిన డబ్బులు వాపస్ తీసుకొన్నాడట! ఒక విజయం అందనంత ఎత్తుకు తీసుకెళితే, మరో అపజయం అధఃపాతాళానికి నొక్కేస్తుందన్నది కాజల్ విషయంలో అక్షరసత్యం కానుంది!

తున్నాం'' అంటూ ఉత్సాహంగా చెప్పాడు శివ!

ప్రభాకరం చెప్పే లోపలనే.

''వెళ్ళనీయరాదండి! పిల్లవాడ్ని మరీ కట్టేయ కూడదు. వాడేమన్నా చిన్నవాడా? ఇంజనీరింగ్ చేస్తున్నాడు'' అని అంటూనే శ్యామల ''నాన్నా మరి అడవులంటున్నావు దారి ఎలా వుంటుందిరా? ప్రమాదం ఏమి లేదు కదా! నీ తోటి వాళ్ళు ఎప్పుడ యినా వెళ్ళరా?'' అంటూ సందేహంగా ప్రశ్నించింది. ''నా క్లాస్‌మేట్‌లు ఇంతకు ముందు వెళ్ళి వచ్చారుట మమ్మీ! చాలా థ్రిల్లింగ్‌గా వుంటుంది. కొన్నివేల మంది వస్తుంటారు. ప్రమాదం ఏమీ వుండదు. చాలావరకు బస్సు పోతుందిట. ఐదారు కిలోమీటర్లు నడవాల్సి వుంటుంది'' అంటూ తల్లి సపోర్టు దొరకడంతో ప్రభాకరం దిక్కు ఆమోదం కోసం చూసాడు.

''మీ ఇద్దరూ నిర్ణయం తీసుకున్నాక నేను చెప్పేదేముంది. అయినా జాగ్రత్త! మమ్మీ నడిగి కావాల్సినంత డబ్బు తీసుకువెళ్ళు. సెల్‌ఫోన్ కూడా తీసుకుపో! మధ్యలో ఫోన్ చేస్తూ వుండు. మీ మమ్మీ ఖంగారుపడుతుంది. నన్ను బతకనివ్వదు. నిన్ను వెతుక్కుంటూ ఆ అడవుల్లోకి పొమ్మంటుంది'' అని అంటూనే తనూ చదువుకునే పుస్తకంలో తల దూర్చాడు ప్రభాకరం.

ఎంతయినా మనస్సు ఒక్కసారి వణికింది. ఇన్ని రోజులూ పిల్లవాడిని ఒక్కడిని దూరంగా పంపలేదు. అదీ అడవిలోకి! ఏమిటో ఈ కాలం పిల్లలు! దేన్నీ ఆపలేం. అని నిట్టూర్పు విడిచాడు.

***

శివ ఇంట్లోంచి వెళ్ళి రెండు రోజులయింది.

వాడులేని లోటు మొదటి రోజునే తెలిసింది. అదేంటో ఒక్క పిల్లవాడయినప్పటికి ఇంటి నిండా పని చేస్తున్నట్టే వుండేది శ్యామలకి. ఇప్పుడు ఖాళీగా అనిపిస్తోంది. ఇద్దరు ఖాళీ సమయంలో టీవి ముందు కూర్చోవడమే పనిగా వుంది. వెళ్ళిన మొదటి రోజున ఫోన్ చేసాడు. మళ్ళా ఫోన్ లేదు. వీళ్ళు ఫోన్ చేస్తుంటే 'అవుటాఫ్ కవరేజ్ ఏరియా' అని వస్తోంది. ఆందోళన.... అంతలోనే ధైర్యం, మరీ అంతగా బెంగ పనికిరాదు. అనుకుంటూ ఒకరి నొకరు సముదాయించుకోసాగారు.

***

ఏవండీ! అర్జంటుగా రండి అని హాల్లోంచి గావుకేక పెట్టింది శ్యామల.

''ఏమయింది!'' అంటూ హడావుడిగా వచ్చాడు ప్రభాకరం.

టీవీలో వార్తలు చూస్తున్న శ్యామల మాట్లాడ కుండా టీవీని చూడమని సైగలు చేసింది.

టీవీలో వార్తలు చదువుతోన్న వ్యక్తి.

'రాష్ట్రంలో విప్లవోద్యమానికి మరో ఎదురు దెబ్బ తగిలింది. గత రెండు దశాబ్దాలకు పైగా అజ్ఞాతంలో వున్న రాష్ట్ర నాయకుడు సత్యం అలియాస్, చిన్న తన సహచరి సారమ్మ, అలియాస్ సారిక, అలియాస్ పద్మలతో సహా జిల్లా ఎస్పీ ముందు లొంగి పోయారు.'

చిన్నాను, సారికలను పోలీసు అధికారులతో సహా చూపిస్తున్నారు. నిర్వికారంగా చూస్తూ నిల బడి వున్నారు. చిన్నా, సారికలు తాము చూసినప్పటికన్నా బాగా చిక్కిపోయి వున్నారు.

''తమ ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతినడంతో ఉద్యమంలో కొనసాగలేక పార్టీ అనుమతితోనే జన జీవన స్రవంతిలోకి వచ్చేసామని'' వారు అన్నారు.

వార్తలు సాగుతూనే వున్నాయి.

ప్రభాకర్, శ్యామల నోట మాట రాకుండా అచేతనంగానే టీవీ చూస్తూనే వున్నారు. ఆ రోజు ఎన్ని సార్లు టీవీ వార్తలు చూసారో లెక్కలేదు.

చిన్న, సారికలు మళ్ళీ తమ దగ్గరకు వస్తారా!? తమ కొడుకును తమతో తీసుకు వెళతానంటారా? శివ లేకుండా తాము బ్రతకగలమా? ఈ ఆలోచనలే సుడులు తిరుగుతుండగా నిద్రపట్టక ఇద్దరి కన్నీళ్ళతో దిండు గలీబులు తడిసిపోయాయి.

***

అప్పటికి వారం గడిచింది.

'శివ' ఇప్పటికీ ఫోన్ చేయలేదు. ''నీ మాట విని వాడిని పంపాను. ఆ రోజు. వాడికి అంత భక్తి ఎక్కడి నుండి వచ్చింది?'' అంటూ తీవ్రంగా శ్యామల మీద విరుచుకు పడ్డాడు ప్రభాకరం.

''నేనేం చేయనండి! రాత్రంతా నన్ను మిమ్మల్ని ఒప్పించమని నిద్రపోనీయకుండా సతాయించాడు. ఒక్కగానొక్క బిడ్డ. ఎప్పుడు అడగలేదు కదా! సరదా పడుతున్నాడని మీకు నచ్చ చెప్పాను. అయినా ఇప్పుడేమీ ముంచుకు పోయింది. ఒకటి రెండు రోజుల్లో రానే వస్తాడు. మీకన్నీ ఖంగారు. బయట మాటలు చెబుతారు కాని వాడు లేకుండా ఒక్క వారం కూడా వుండలేరు'' అని దెప్పి పొడిచింది శ్యామల.


''ఆ మాటలు తర్వాత కాని ఆ పేపరు ఇలా పడేయ్''అంటూ కాఫీ కప్పుతో సోఫాలో చేరగిల పడ్డాడు ప్రభాకరం.

పేపరు పేజీలు తిరగవేస్తున్న ప్రభాకరం చూపులు ఒక వార్తమీద నిలిచిపోయాయి.

''విప్లవ పార్టీ కొరియర్‌గా పని చేస్తున్న విద్యార్థి నల్లమల అడవుల్లో అరెస్టు''

హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థి 'శివ' విప్లవ సాహిత్యంతో పాటు నల్లమల అడవుల్లో పట్టుబడ్డాడు. తాను రాష్ట్ర నాయకులకు కొరియర్‌గా వ్యవహరిస్తున్నానని, అజ్ఞాతంలో గల నాయకులకు, సాహిత్యం, సమాచారాన్ని అందజేయడానికి వచ్చానని విచారణలో అంగీకరించాడు. తనను తీసుకు వెళ్ళాల్సిన కాంటాక్టు కోసం బస్ స్టాప్‌లో రాత్రి 10 గంటలకు ఎదురు చూస్తుండగా అనుమానం వచ్చిన పోలీసులు ఆ విద్యార్థి బ్యాగు తనిఖీ చేయడంతో గుట్టు బయటపడింది''. ★

## స్ఫూర్తి



నా కథకు బహుమతి నిచ్చి ప్రోత్సహించినందుకు 'నవ్య వీక్లీ' పసుపులేటి లక్ష్మినారాయణ స్మృతి సాహితి వారికి నా హృదయ పూర్వక కృతజ్ఞతలు. తెలుగువాడి జీవితంలో వామపక్ష ఉద్యమం ఒక భాగమయిపోయింది. జయాపజయాలతో నిమిత్తం లేకుండా ఎంతో మంది యువతీయువకులు సమసమాజ స్థాపన కోసం ఈ ఉద్యమానికి తమ జీవితాలను అంకితం చేసి పని చేస్తున్నారు. ఒక తరం నుండి మరో తరం ఈ వారసత్వాన్ని కొనసాగిస్తూనే వుంది. అదే నా కథ 'గమనం'కు స్ఫూర్తి.

నా జన్మస్థలం హైదరాబాద్. వయస్సు 50+. వరంగల్ జిల్లాల్లో చదివాను.

కథలు రాయడం ఈ మధ్యనే మొదలు పెట్టాను. ఆరు లేదా ఏడు కథలు ప్రచురింపబడ్డాయి. కవితలు దాదాపు వంద దాకా రాసుంటానేమో! 'ఆంధ్రజ్యోతి'తో పాటు వివిధ పత్రికలు ప్రచురించి ప్రోత్సహిస్తున్నాయి. సాహిత్యం, రాజకీయ, సామాజిక అంశాల మీద వివిధ దిన పత్రికల్లో ఎన్నో వ్యాసాలు వచ్చాయి.

**సత్యభాస్కర్,**
*3-8-7, ఫ్లాట్ నెం. 101,*
రాధాదేవి అపార్టుమెంట్సు
ఫేజ్-1, రామంతపూర్
హైదరాబాదు - 500 013
సెల్: 98483 91638

